క్లుప్తంగా

పండుగల ఆచారాలు ప్రతి ఒక్కరూ పాటించాలి



విజయవాడస్పోర్ట్స్: సన్మార్గంలో నడిపించే పండుగల ఆచారాలు ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కోరారు. కమిషనరేట్ కార్యాలయంలో కార్యాలయ పరిపాలన విభాగం బుధవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలు పోలీసు అధికారులు, సిబ్బంది మధ్యలో జరుపుకోవడం తనకు ఎంతో ఆనందదాయకంగా ఉందని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. అక్కడున్న వారందరికీ ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, కార్యాలయ ఏవో సునీత, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

బుడమేరులో దోమల నియంత్రణ చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు బుధవారం బుడమేరులో దోమల నివారణ చర్యలు చేపట్టారు. బుడమేరులో పేరుకు పోయిన గుర్రపు డెక్కను అధునాతన ట్రక్సర్ మెషీన్, లాంగ్ ఆర్మ్, బోటుల సహాయంతో తొలగించారు. నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్న చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

దేవదేవునకు ప్రత్యేక పూజలు



విజయవాడ కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా శృంగేరీ పీఠ పాలిత శివరామకృష్ణ క్షేత్రంలో బుధవారం శ్రీ వెంకటేశ్వరునికి, గోదా సమేత శ్రీ రంగనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్ల మూల విగ్రహాలకు తులసి మాలలతో అర్చన చేశారు. ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు పాశురాలను పఠించారు. వేదపండితులు రుగ్వేద పారాయణం చేశారు. ధర్మాధికారి శిష్ట్లా ప్రసాద్ మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా 2025 సంవత్సరం జనవరి 3 వ తేదీన దీపోత్సవం, 8న ముత్యాల హారతులు, 10న ముక్కోటి, 11న కుడారై ఉత్సవం, 13న గోదా కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామివారికి బల్లెం పూర్ణయ్య గురుస్వామి పంచామృత అభిషేకం, పుష్పార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, అయ్యప్పలు స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

వినియోగదారుల కొనుగోలు ప్రవర్తనపై ఫొటోగ్రఫీ పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వినియోగదారుల అవగాహన వారోత్సవాలలో భాగంగా వినియోగదారుల కొనుగోలు ప్రవర్తన అంశంపై ఫొటోగ్రఫీ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వినియోగదారుల కొనుగోలు శక్తి, పరిస్థితులు, అవసరాలపై ఆధారపడి ఉంటుందని విద్యార్థులు ఫొటోగ్రఫీ రూపంలో ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేశారు. కళాశాల కన్జ్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నవీన, కామర్స్ విభాగం ఇన్‌చార్జ్ సీహెచ్ కొండలరావు వినియోగదారుల హక్కుల గురించి వివరించారు.

నేడు మధురానగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ కొబ్బరితోటలో గురువారం జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యాన సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఫెలోషిప్ వ్యవస్థాపకుడు బందెల దయానందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు, నిరుపేదలకు నూతన వస్త్రాల పంపిణీ, 2వేల మందికి ప్రేమ విందు ఏర్పాటు చేశామన్నారు.

బడుగుల బతుకుపై బుడమేరు దెబ్బ



పనుల కోసం ఎదురు చూస్తున్న కార్మికులు

బుడమేరు వరద భవన నిర్మాణ కార్మికులను చావు దెబ్బ తీసింది. వరద ముంపు వీడి నాలుగు నెలలవుతున్నా ఈ ప్రాంతంలో రోజువారీ కూలీల జీవన స్థితిగతులు సాధారణ స్థాయికి రాలేదు. వరద ప్రభావంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలవడంతో దానికి అనుసంధానంగా ఉన్న దాదాపు 32 రంగాలకు చెందిన కార్మికులు పనులు లేక పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడింది. బుడమేరు వరద దెబ్బకు తోడు కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా ఇంకా ఇసుక సామాన్యులకు అందని పరిస్థితి ఉండడం కూడా ఇందుకు మరో కారణమని చెప్పవచ్చు. ఏతావాతా కార్మికుల పరిస్థితి దయనీయంగా తయారైంది.

- ఉపాధి లేక కార్మికుల అవస్థలు
- ఇంకా పుంజుకోని రియల్ ఎస్టేట్ రంగం
- నెలలు గడిచినా పనులు దొరకని దుస్థితి
- పూట గడవక పస్తులుంటున్న వేలాది కుటుంబాలు

పాయకాపురం(విజయవాడరూరల్): బుడమేరు వరద ప్రభావం భవన నిర్మాణ కార్మికులను ఇంకా వెంటాడుతూనే ఉంది. ముంపు ప్రాంతాల్లోని భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అవస్థలు పడుతున్నారు. రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, రాధానగర్, సుందరయ్యనగర్, అజిత్ సింగ్ నగర్, బుడమేరు పరిసర ప్రాంతాల్లోని భవన నిర్మాణ కార్మికులు ప్రతి రోజూ ప్రకాష్ నగర్ సెంటర్‌లో నిలబడి పనికి ఎవరు పిలుస్తారా అని ఎదురు చూస్తున్నారు. తాపీమేస్త్రిలు, సున్నం కలిపే వారు, బరువులు మోసే వారు, నాపరాళ్ల పనులు చేసే వారు, పాత భవనాలు కూల్చేవారు ఇలా రక రకాల భవన నిర్మాణ పనులకు సంబంధించిన కార్మికులు రోజువారీ కూలి పనులకు వెళ్లే వారు పడిగాపులు కాస్తున్నారు.గతంలో ఎన్నడూ చూడని విధంగా విజయవాడలో వచ్చిన వరద బీభత్సం వేలాది మంది భవన నిర్మాణ కార్మికులకు తీరని శాపంగా మారింది. వరదల కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయింది. కొత్తగా భవన నిర్మాణాలపై బిల్డర్లు ఆసక్తి చూపడంలేదు. ఒక వైపు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించడం, భూమి క్రయ విక్రయాలు లేకపోవడంతో వ్యాపారులతో పాటు ఉపాధి లేక కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. అపార్టుమెంట్ల నిర్మాణాలు లేకపోవడంతో ఈ ప్రాంతంలోని కార్మికులకు దైనందిన జీవనోపాధి కరువైంది. ఇసుక పాలసీ విధానం రోజువారి కూలీల పాలిట నరకంగా తయారైంది. భవన నిర్మాణ కార్మికులు వాటికి అనుసంధానంగా 32 విభాగాలుగా వున్న తోపుడు బండ్లు, ఆటోలు, ట్రాక్టర్ల డ్రైవర్లు, ఐరన్ రాడ్ మేస్త్రిలు, తాపీ పని వారు, సీలింగ్, ఎలక్ట్రికల్, లోడింగ్ రవాణా, ఇటుకలు, సిమెంటు, చిప్స్ కిటికీలు, గోనెసంచులు, మెటీరియల్ సప్లయిర్స్ వ్యాపారాలు ఆశించిన స్థాయిలో లేక రోజువారీ పనులు లేక ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ సాయం అందక తనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల పరిస్థితిని తలచుకుంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వరదలు వచ్చిన సందర్భంలో తూతూ మంత్రంగా రేషన్ సాయం మాత్రం అందించి చేతులు దులుపుకొంది. అనంతరం రెక్కాడితే కాని డొక్కాడని రోజువారీ కూలీలకు ఉపాధి కల్పనపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కార్మికులు పనులు లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పనులు లేకుండా పోయాయి



బుడమేరు వరద వచ్చిన తర్వాత మాకు సరైన పనులు లేవు. వరదలు రావడంతో బిల్డర్లు అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ గృహాల నిర్మాణాలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో పనులు లేకుండా పోయాయి.

–ఎ. సోములు, తాపీ మేస్త్రి, ప్రకాష్‌నగర్

ఇసుక దొరక్క పనులు మందగించాయి



బుడమేరు వరద మా జీవితాలతో ఆడుకుంది. ప్రభుత్వం ఇసుకను సరఫరా చేయకపోవడంతో పనులు మందగించాయి. రోజువారీ కూలీ పనులకు వెళ్లే భవన నిర్మాణ కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు.

–వి.నాగరాజు, అజిత్ సింగ్‌నగర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్ 11 కె.వి గులాబీ తోట ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గులాబీ తోట, సాంబమూర్తి రోడ్డు, పున్నయ్య కాలనీ, పసుపులేటి వారి స్ట్రీట్, బాలాజీ స్ట్రీట్, బీఆర్టీఎస్ రోడ్డు, భానూ నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్లు పంపిణీ



విజయవాడస్పోర్ట్స్: ట్రాఫిక్ పోలీసులకు అగర్వాల్ కంటి ఆసుపత్రి యాజమాన్యం సన్ గ్లాసెస్(కళ్లజోళ్లు) పంపిణీ చేయడం పట్ల పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులకు అగర్వాల్ కంటి ఆసుపత్రి సమకూర్చిన కళ్ల జోళ్లను గవర్నర్‌పేటలోని ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం పంపిణీ చేశారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ కె.కె.ఎస్. చక్రవర్తి, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి



సత్యనారాయణపురంలో సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): డివిజన్‌లో నెలకొన్న ప్రతి సమస్యను అధికారుల సహకారంతో త్వరలోనే పరిష్కరించి సమస్య రహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి తెలిపారు. నగరపాలకసంస్థ జోనల్ కమిషనర్ ప్రభుదాస్, సీఎంహెచ్ఓ రామకోటేశ్వరరావు, ఇతర అధికారులతో కలసి బుధవారం కార్పొరేటర్ శర్వాణిమూర్తి డివిజన్‌లో పర్యటించారు. సన్నిధానం వారి వీధి, బ్రహ్మయ్య పంతులు వీధి, కావూరి వారి వీధి, శివరావు వీధి, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, ముదిగొండ వారి వీధి, ఆంధ్రరత్న పార్క్ రోడ్డు తదితర ప్రాంతాలలో పర్యటించి అక్కడ నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా అనేక ప్రాంతాల్లో సైడు డ్రైన్‌ల ఆక్రమణలతో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను పరిశీలించారు. అనేక వీధుల్లో గోతులు తవ్వి పూడ్చకపోవడంతో అక్కడ నెలకొంటున్న ప్రమాదాలు, విద్యుత్ స్తంభాల వద్ద గుట్టలుగా పేరుకుపోయిన కేబుల్స్‌తో ఇబ్బందులు, ఎన్ఆర్‌పీ రోడ్డులో వ్యాపారస్తులు వ్యర్థాలను సైడు కాలువల్లోనే పడవేయడం, తాగునీటి లీకేజీలు తదితర సమస్యలను అధికారులకు ప్రత్యక్షంగా వివరించారు. దీనిపై జోనల్ కమిషనర్ స్పందించి అక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, టీపీఓ కృష్ణనాయక్, ప్లానింగ్ సెక్రటరీలు, ఇమ్యూనిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి పేరుతో ప్రజల జేబులకు చిల్లు

నగర రహదారులు ప్రైవేటుకు దారాదత్తం చేయటంపై మల్లాది విష్ణు ఆగ్రహం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగర రహదారులను ప్రైవేటుకు దారాదత్తం చేయటానికి ప్రభుత్వం సిద్ధమవడంపై వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర రహదారులను ప్రైవేటుకు అప్పగించటం వల్ల ప్రజలపై భారం పడే ప్రమాదం ఉందన్నారు. పదేళ్ల పాటు వ్యాపార ప్రకటనలు, హోర్డింగుల ద్వారా కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయానికి కూడా గండి పడుతుందని అభిప్రాయపడ్డారు. విజయవాడ నగరంలో 23 కి.మీ. మేర 17 రహదారుల నిర్వహణను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) విధానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు చూస్తున్నారని విమర్శించారు. ఇదే జరిగితే సెంట్రల్ పరిధిలోని బీఆర్టీఎస్ రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, జీఎస్ రాజు రోడ్డుతో సహా 7.3 కి.మీ. మేర బిజీగా ఉండే రహదారులపై అడుగు పెట్టాలంటే ప్రజలపై భారం పడే అవకాశం ఉందన్నారు. ఒక్కో రహదారి కూడా 5 నుంచి 6 డివిజన్లను కలుపుతూ ఉంటుందని, ప్రభుత్వ నిర్ణయం వల్ల ఆయా ప్రాంతాల ప్రజలు ఎంతగా నష్టపోతారో ఒక్కసారి ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యంగా పాత గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు రెండు నియోజకవర్గాల మధ్య అనుసంధానంగా వందలాది మంది పేషెంట్లు నిత్యం వస్తూ పోతూ రద్దీగా ఉంటుందన్నారు. అటువంటి రహదారిని ప్రైవేటుకు అప్పగించటంలో ప్రభుత్వ ఉద్దేశమేమిటని సూటిగా ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నంతకాలం ఎక్కడా రోడ్లు బాగోలేవంటూ ఊదరగొట్టిన చంద్రబాబు, ఇప్పుడు రోడ్ల అభివృద్ధి పేరుతో ప్రజల జేబులకు చిల్లులు పెట్టేందుకు చూస్తున్నారని మల్లాది విష్ణు విమర్శించారు. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని, ఐడియాలు మాత్రం చాలా ఉన్నాయని చెప్పిన చంద్రబాబు చివరకు ప్రజలపై భారాలు మోపుతున్నారని నిప్పులు చెరిగారు. ఆరు నెలల కాలంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటగా, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15 వేల కోట్ల భారం వేశారని ధ్వజమెత్తారు. రోడ్లను అభివృద్ధి చేయడం, వాటిని సక్రమంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని, అంతేకానీ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ చేతుల్లో పెట్టడం కాదన్నారు. ఈ ప్రతిపాదన రాష్ట్ర రవాణా రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తుందన్నారు. ప్రభుత్వం ఈ ఆలోచనను తక్షణం విరమించుకోవాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు.

● హై లైఫ్ బ్రైడల్ ఎగ్జిబిషన్ ప్రారంభం






విజయవాడ నోవాటెల్ హోటల్లో హై లైఫ్ బ్రైడల్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. పలువురు మోడల్స్ పాల్గొని షోరూంలోని ఆభరణాలు ప్రదర్శించారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆలోచింపజేసిన 'మనస్సాక్షి' నాటిక



మనస్సాక్షి నాటికలో ఒక కీలక సన్నివేశం

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోగల ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముఖ్యంగా 'మనస్సాక్షి' నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. మనిషికి కావల్సింది అవినీతితో సంపాదించే డబ్బు కాదని, గుప్పెడు మెతుకులు, ఆరు అడుగుల నేల, చారెడు గుడ్డ అన్న కథాంశంతో కళాకారులు రక్తి కట్టించారు. హర్ష క్రియేషన్స్ (విజయవాడ) పక్షాన నటుడు కత్తి శ్యాంప్రసాద్ నిర్వహణలో దివంగత డాక్టర్ బ్రహ్మానందం రచించిన ఈ నాటికకు రంగస్థల సీనియర్ నటుడు పిల్లా నటరాజ్ దర్శకత్వం వహించి నటించారు. వేంపాటి రమేష్, ఎస్.అమృతవర్షిణి, సాగర్, మల్లేశ్వర పట్నాయక్ పాత్రోచితంగా నటించి ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. అనంతరం చింతాడ ప్రసాద్ తన ధ్వన్యనుకరణ (మిమిక్రీ)తో అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీసాయి బాబా నాట్యమండలి (విజయవాడ) ఆధ్వర్యంలో కళాకారిణులు జీఎస్‌డీ కుసుమసాయి, బత్తిన రూపశ్రీ, చిందాన తేజశ్రీ ఆంధ్ర నాట్యం, కూచిపూడి, భరత నాట్యంతో పలు అంశాలకు చక్కని ఆంగికాభినయంతో నర్తించారు. శ్రీదేవి కళా నాట్య మండలి (ఉయ్యూరు) వారు బాలనాగమ్మ నాటకం నుంచి 'మాయలఫకీర్' సీను ప్రదర్శించారు. ఈ సీనులో జెట్టి నరసింహారావు, కణితి ప్రభావతి నటించగా, చింతలపూడి నాగేశ్వరరావు బృందం వాయిద్య సహకారం అందించారు. ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సహకారంతో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో బుధవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సౌత్ ఏసీపీ బంగార్రాజు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో సీఐ అడపా నాగమురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు సూచించారు. స్థానిక 31వ డివిజన్ అంబేడ్కర్ కాలనీ వార్డు సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వ సేవలను వివరించారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు, దరఖాస్తులు స్వీకరించారు. ఇళ్లు మంజూరు చేయాలని 75 మంది, ఇళ్ల రిజిస్ట్రేషన్ కోసం 150 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పడమటి రామకృష్ణ, దేవరపు మాల్యాద్రి, డి.మురళీకృష్ణంరాజు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండకు అభినందనలు

విజయవాడకల్చరల్: ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు అరసం కృష్ణాజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు కొండపల్లి మాధవరావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. అరసం ద్వారా మరుగున పడిన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన ఆయన సాహిత్య కృషికి గుర్తింపు లభించిందన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో వర్చ్యువల్ ల్యాబ్స్ ఆన్‌లైన్ సదస్సు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అమృత విశ్వ విద్యాపీఠం ఆధ్వర్యాన వర్చ్యువల్ ల్యాబ్స్ ఆన్‌లైన్ సదస్సు జరిగింది. అమృత విశ్వ విద్యాపీఠం ప్రాజెక్టు మేనేజర్ పీఎఫ్ సానీష్, రీసెర్చ్ అసోసియేట్ నిజిన్ విద్యార్థులకు వర్చ్యువల్ ల్యాబ్‌ల ద్వారా ప్రయోగశాలలో జరిగే కార్యకలాపాలను పరిశీలించటం, ప్రయోగాలు చేయటానికి అవకాశం కల్పించటం జరుగుతుందన్నారు. దూర ప్రయోగాల ద్వారా విద్యార్థులు ఆధునికీకరించిన భావనలు, ప్రయోగాలను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు భౌతిక, రసాయన, వృక్ష, జంతు, జీవ రసాయన, కంప్యూటర్ శాస్త్రాలలో ఉన్న ప్రయోగాలను వర్చ్యువల్ విధానంలో చేసి చూపించారు. ప్రయోగశాల పరికరాలను వర్చ్యువల్‌గా అందుబాటులో తెచ్చుకుని ఉపయోగించే విధానాన్ని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, వృక్షశాస్త్ర విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ జి.స్వప్న మాట్లాడుతూ విద్యార్థులకు నూతన ప్రయోగాలను తెలియజేసేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జె.నాగేశ్వరరావు, ఎస్‌వీ తహసీన్, షేక్ బీబీ, నాగపద్మావతి, జి.విజయదీప్, శారదాలక్ష్మి, సైన్సు విభాగాలకు చెందిన 30 మంది అధ్యాపకులు, కృష్ణాజిల్లాకు చెందిన 165 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు





ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో భవానీ దీక్షల విరమణలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక గుడి కెనాల్ రోడ్డు వైపు నుంచి ఘాట్ రోడ్డు వరకు క్యూలైన్లు సిద్ధం చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ టెంట్లు అమర్చుతున్నారు. పవిత్ర పుణ్యస్నానాల కోసం భవానీ ఘాట్ వద్ద జల్లు స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







● **ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** దుర్గమ్మ సన్నిధిలో బుధవారం విజయవాడకు చెందిన శ్రీదమని ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. ధర్మపథం వేదికపై దమని ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాడుగుల లక్ష్మణరావు బృందం పలు భక్తి గీతాలను ఆలపించింది. దండు చంద్ర శేఖర్, తల్లపురెడ్డి శ్రీనివాస రెడ్డి, రజనీ, రూపశ్రీ, కుసుమ పాటలను పాడారు.